


# నేను, పెన్సిల్‌ని

లియొనార్డ్ ఇ. రీడ్

# నేను, పెన్సిల్‌ని

నా వంశవృక్షం

లియొనార్డ్ ఇ. రీడ్

తెలుగు అనువాదం

రాఘవేందర్ అస్కాని

విషయసూచిక


* లారెన్స్ డబ్ల్యూ. రీడ్ చే పరిచయం ...................... 1
* రాఘవేందర్ అస్కాని చే పరిచయం ...................... 6
* లియోనార్డ్ ఇ. రీడ్ చే "నేను, పెన్సిల్" ...................... 7
* మిల్టన్ ఫ్రైడ్మన్ చే అనంతసూచిక ...................... 15
* లియోనార్డ్ ఇ. రీడ్ జీవిత చరిత్ర ...................... 17

FEE FOUNDATION *for* ECONOMIC EDUCATION

**fee.org**

స్వేచ్ఛ సమాజం, ఆర్థిక, నైతిక మరియు
చట్టపరమైన సూత్రాలతో కాబోయే కాలంనాటి నాయకులను
ప్రేరేపించడం, అవగాహన కల్పించడం, వారిని అనుసంధానించడమే
ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్ ఎడ్యుకేషన్ యొక్క లక్ష్యం.

SWATANTRATA
CENTER FOR HUMAN FLOURISHING FOUNDATION

**swatantrata.org**

స్వతంత్రత సెంటర్ ఫర్ హ్యూమన్ ఫ్లోరిషింగ్
ఫౌండేషన్ తరుపున తెలుగు అనువాదం.

# నేను, పెన్సిల్‌ని

# పరిచయం

## లారెన్స్ డబ్ల్యు. రీడ్

అనర్గళం. అసాధారణం. కాలాతీతం. కాలానుగుణం. ప్రామాణికం.

ప్రపంచానికి పరిచయమైన ఆరు దశాబ్దాల తరువాత లియొనార్డ్ రీడ్ "నేను, పెన్సిల్‌ని" ఇటువంటి ప్రశంసల పరంపరను కలిగించక మానదు. అందుకు అన్ని రకాల యోగ్యతలున్న రచన ఇది. ఈ చిన్నపాటి వ్యాసం అన్ని వయసుల వారి కళ్లు, మనసులను అంతలా తెరిపిస్తుంది. మొదటిసారిగా చదివిన చాలామంది పాఠకుల ప్రపంచమే మారిపోతుంది. సరికొత్త రీతిలో సమాజాన్ని చూడటం ప్రారంభిస్తారు.

ఆకట్టుకునే కథ రూపంలో రాస్తే ఆలోచనలు చాలా శక్తిమంతమవుతాయి. లియొనార్డ్ రచన సారాంశాన్ని పెన్సిల్ పలికే ఈ మనోహరమైన మాటలే వ్యక్తం చేస్తాయి. ఒక సాధారణ పెన్సిల్‌ను తయారుచేసేందుకు అవసరమైన పూర్తి పరిజ్ఞానం, నైపుణ్యాలు ఏ ఒక్క వ్యక్తికి కూడా లేనప్పుడు ఆర్థిక వ్యవస్థల్లో ప్రత్యేకించి "ప్రణాళిక" ఉండదు! లియొనార్డ్ "నేను, కారుని" లేదా "నేను, విమానాన్ని" రాసి ఉండవచ్చు. కానీ అలాంటి క్లిష్టమైన వస్తువుని ఎంచుకోవటం సందేశాన్ని అందరికీ చేర్చడం అయ్యేది కాదు. ఒక వ్యక్తి ఎంత తెలివైనవాడయినా కావచ్చు, అతని పేరు చివర ఎన్ని డిగ్రీల్కైనా ఉండొచ్చు, కానీ కేవలం ఒక్కడు.. మళ్లీ చెబుతున్నా, ఒకే ఒక్కడు, కారో, విమానమో తయారు చేయడం సంగతి అలా ఉంచి - ఒక చిన్న, ప్రతి రోజూ ఉపయోగించే పెన్సిల్‌ను కూడా తయారు చేయలేడు.

ఉన్నత స్థాయిలో ఉన్నవారికి, శక్తిమంతులుగా వెలుగొందుతున్నవారికి వినమ్రతను నేర్పే సందేశమిది. ఇతరులు ఏం చేయాలో, ఎలా చేయాలో చెబుతూ వారి జీవితాల్ని కూడా తాము శాసించగలమని భావించేవారి మిడిసి పాటును ఇది ముల్లుగ్రతో పొడుస్తుంది. పైస్థాయిలో చేసే కేంద్రీకృత ప్రణాళిక ఎందుకు అహంకారపూరితమైనదో, ఎంత వృథా వ్యవహారమో సాధారణ పరిభాషలో వివరించి చెబుతుంది. దీన్నే నోబెల్ గ్రహీత, ఆస్ట్రియన్ ఆర్థికవేత్త ఎఫ్.ఎ హయెక్ "జ్ఞాన కపటత్వం" అని చక్కగా అభివర్ణించారు.

నిజానికి, ఈ విషయంలో రీడ్ ఆలోచనపై ప్రధానంగా ప్రభావం చూపింది 1945లో హయెక్ రాసిన సుప్రసిద్ధ వ్యాసం "సమాజంలో జ్ఞానాన్ని వినియోగించటం". ఆరోజుల్లో సోషలిస్టుల కుహనా వాదనల్ని తిప్పికొడుతూ హయెక్ ఇలా రాశారు.

“ప్రణాళిక రూపొందించాలా, వద్దా అన్నది కాదు ఇక్కడ వివాదం.. ప్రణాళిక రూపకల్పన కేంద్రీకృతంగా, ఆర్థిక వ్యవస్థ అంతటికీ ఒక్క అధికార కేంద్రం చేతిలో ఉండాలా, లేక అనేకమంది వ్యక్తుల చేతుల్లో ఉండాలా అన్నది అసలు వివాదం”.

భయోత్పాత ఫ్రెంచ్ విప్లవాన్ని మాక్సిమిలియన్ రోబెస్పియర్ ఈ రకంగా సమర్థించినట్లు చెబుతారు. ‘గుడ్లు పగలగొట్టకుండా మీరు ఆమ్లెట్‌ను ఆశించలేరు”. ప్రజల సామాజిక, ఆర్థిక జీవితంపై ప్రభుత్వాల కేంద్రీకృత పెత్తనం ఉండాలనే వాదనతో ఇతరుల జీవితాల్ని మలచేందుకు అవిశ్రాంతంగా శ్రమించి చివరికి విప్లవంలోని రక్తసిక్త దశకు, **1793-94** మధ్య బీభత్స పాలనకు అతను రూపశిల్పి అయ్యాడు.

ప్రభుత్వ ప్రణాళికాకర్తలు పైస్థాయిలో, మిగిలినవారంతా దిగువన ఉండేలా ఒక ఊహాజనిత ఆదర్శ సమాజాన్ని రుద్దే నిష్ఫల ప్రయత్నంలో రాబెస్పియర్, అతని గిలొటిన్ వేలాది గుడ్లను పగలగొట్టాయి. మనల్ని కలవరపరచే నమూనాకి ఫ్రెంచ్ అనుభవం ఒక ఉదాహరణ. సోషలిస్టులు, ప్రభుత్వ జోక్యవాదులు, సామూహికవాదులు, రాజ్య నియంతృత్వ వాదులు - వాళ్లని మీరు ఏ పేరుతోనైనా పిలవండి. ఉమ్మడి మంచి, సమసమాజం కోసం వారి ఊహ, ఆ లక్ష్య సాధన ప్రక్రియలో వేసిన ప్రణాళికలు ఇతర ప్రజల్నిచంపటం లేదా వారిని పేదరికంలోకి నెట్టటం వల్ల అవన్నీ ప్రతిసారీ విఫలమైనప్పటికీ వాటిని కొనసాగిస్తూ పోయారు. తమ విజన్, ప్రణాళికలకు అనుగుణంగా సమాజాన్ని పునర్వ్యవస్థీకరిం చేందుకు వారు వేసిన ప్రణాళికలు చరిత్ర నిండా కనిపిస్తాయి. సోషలిజం ఎప్పటికైనాఅంతిమ ఫలాన్ని సాధించగలిగితే, ఇలా ఉంటుంది: అన్నీ తెలిసినవాళ్లం అనుకునేవాళ్లు, గుడ్లను విచక్షణారహితంగా పగలగొట్టినా ఏనాడూ, ఎప్పుడూ ఒక్క ఆమ్లెట్‌ను కూడా సృష్టించని వాళ్లు అమలు చేసిన ఒక వ్యూహాత్మక కాల్పనికత ఇక్కడ శాశ్వత విశ్రాంతి తీసుకుంటోంది.

ప్రపంచంలోని రోబెస్పియర్లలో ఎవరికీ ఒక పెన్సిల్‌ను ఎలా తయారు చేయాలో తెలియదు. కానీ మొత్తం సమాజాలన్నిటినీ పునర్నిర్మించాలని వాళ్లు కోరుకున్నారు. ఎంత అసంబద్ధమైనది, ఎంతటి విషాదకరమైనది! మనందరికీ తెలిసిన నియంతల పేర్లను ఉద్దేశించే ఇదంతా చెప్పారనుకోవద్దు. అలా అనుకుంటే, లియొనార్డ్ రీడ్ సందేశంలోని అసలు అంశాన్ని విస్మరించిన వారమవుతాం. ప్రణాళిక వేసేవారు ఓ భారీ ప్రణాళిక వేయటం వల్ల పొరపాటు మొదలవుతుందన్నదికాదు “నేను, పెన్సిల్‌ని”లోని పాఠం. వినమ్రతను విస్మరించి, తనకు తెలియనిది తెలుసని ఎప్పుడైతే భావిస్తారో, శాంతియుతంగా ఉన్న వ్యక్తులపై రాజ్య వ్యవస్థ బలాన్ని ఎప్పుడైతే ప్రయోగిస్తారో అప్పుడు తప్పు మొదలవుతుంది. ఇది కేవలం జాతీయ స్థాయి జాడ్యం కాదు. నిజానికి స్థానికంగా కూడా పీడించే వ్యాధి.

మన మధ్యే కొంతమంది ఉన్నారు. ప్రభుత్వాధికారం తమ వైపు ఉంటే, మార్కెట్‌లో రేపు ఎవరు విజేతలవుతారో, ఎవరు పరాజితుల వుతారో నిర్ణయించగల మని, ధరలు, అద్దెలు ఎలా ఉండాలో నిర్దే శించగలమని, మన ఇళ్లు, కార్లకి ఏ రూపాల్లో ఇంధనం వాడాలో నిర్ణయిం చగలమని, ఏ పరిశ్రమలు కొనసాగాలో, ఏవి మూసివేయాలో తేల్చిచెప్పగలమని వారు అనుకుంటుంటారు.

**మన మధ్యే కొంతమంది ఉన్నారు. ప్రభుత్వాధికారం తమ వైపు ఉంటే, మార్కెట్‌లో రేపు ఎవరు విజేతలవుతారో, ఎవరు పరాజితులవుతారో నిర్ణయించగలమని, ధరలు, అద్దెలు ఎలా ఉండాలో నిర్దేశించగలమని అనుకుంటూ ఉంటారు..''**

వాళ్లు కొన్ని నిముషాల పాటు ఆగి ఈ పెన్సిల్ అనే ఈ సాదాసీదా రాత ఉపకరణం నుంచి కాస్త వినమ్రత నేర్చుకోవాలి.

కేంద్రీకృత ప్రణాళిక పట్ల ఉన్న నిరాధార అంచనాల్ని తోసిపుచ్చుతూనే వ్యక్తుల అత్యున్నత స్ఫూర్తిదాయక దృక్పథానికి “నేను, పెన్సిల్‌ని'' పట్టం గడుతుంది. సోషలిస్టు సిద్ధాంతకర్తలు కలలో మాత్రమే ఊహించగలిగే ఆర్థిక అద్భుతాల్ని ఆడమ్ స్మిత్ ప్రతిపాదించిన ధరలు, ఆస్తి, లాభాలు, ప్రోత్సాహకాల “అదృశ్య హస్తం'' చూపే మార్గంలో స్వేచ్ఛా ప్రజానీకం వాస్తవ, తమ రోజువారీ ప్రపంచంలో సాధించగలరు. ఒక వ్యక్తి “సూత్రధారి''గా లేకుండానే ప్రపంచవ్యాప్తంగా అసంఖ్యాక వ్యక్తుల ఆసక్తులు కలగలిసి పెన్సిళ్ల ఉత్పత్తిగా మారిన తరహాలోనే, కోట్లాది మందికి ఆహారం, బట్టలు, ఇళ్లు, విద్య, వినోదం అందించేందుకు ఇంకా పైస్థాయిలో స్వేచ్ఛా మార్కెట్‌లో వాళ్లంతా కలసిరాగలరు.

వ్యాసంలోని కాలాతీత సందేశాన్ని మరో కొత్త తరానికి అందించేందుకు ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఇఇ) ఎంతో సగర్వంగా ఈ “నేను, పెన్సిల్‌ని'' కొత్త ముద్రణను తీసుకొస్తోంది. ఏదోకరోజు వంద సంవత్సరాల సంచిక వస్తుంది, బహుశా వెయ్యేళ్ల సంచిక కూడా. నిజం, ఇది ప్రతి తరం వ్యాసం.

**లారెన్స్ డబ్ల్యు. రీడ్,**
ప్రెసిడెంట్, ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్ ఎడ్యుకేషన్
మే 2015

# నేను, పెన్సిల్‌ని
## తెలుగు సంచికకు పరిచయం

“నేను ఎకానమీ (ఆర్థిక వ్యవస్థ) ని ప్రణాళిక చేయగలను” అని ఎవరైనా నాతో చెప్పితే, నేను వెంటనే చెప్పేది, “అది అసంబద్ధం. పెన్సిల్ ఎలా తయారుచేయాలో కూడా నీకు తెలియదు!”

1958లో “నేను, పెన్సిల్‌ని” అనే ప్రముఖ వ్యాసాన్ని రాసిన లియోనర్డ్ రీడ్ ఒక గొప్ప మనిషి. ఆయన చివరి కాలంలో ఆయనను నేను వ్యక్తిగతంగా కలిశాను. ఆయనకు తెలుసు అహంకారం, స్వీయ గర్వం సామ్యవాద (సోషలిజం) ఆలోచనలలో భాగం. మనుషులు తమ జీవితాన్నే నిర్వహించుకోవడంలో బిజీగా ఉంటారు. మరి ఇంకొంతమందిని నడిపించడం కష్టం. లక్షలాది మందిని నడిపించగలమంటే అది అర్థరహితం. ఈ విషయాన్ని సాధారణమైన ఒక పెన్సిల్ ఉదాహరణతో అర్థమయ్యేలా చెప్పడం ఆయన ప్రతిభను చూపిస్తుంది.

లియోనర్డ్ రీడ్ తన ప్రసంగాల్లో తరచూ చెప్పే విషయం “నాకు అన్నీ తెలుసు” అనే మనస్తత్వం శాంతికీ, స్వేచ్ఛకీ ప్రమాదకరం. ఎవరైనా వ్యక్తి నేను నీకంటే నీ జీవితం మెరుగా నడిపించగలను, నీవు నా ఆదేశాలు పాటించాలి అనే ధోరణితో ప్రవర్తిస్తే, దానికి ఫలితం హింస మరియ దాసత్వం అవుతుంది.

కానీ ఒక వ్యక్తి తనకు నిజంగా ఎంత తక్కువ తెలుసు అని తెలుసుకున్న తర్వాత, అతను అవుతాడు మరింత వినయపూర్వకంగా, ఇతరులలో వ్యత్యాసాలను సహించటానికి మరింత ఇష్టపడతారు మరియు తనను తాను మెరుగుపరుచుకోవడంపై ఎక్కువ దృష్టి పెట్టాడు. ఒక సాధారణ పెన్సిల్ తయారీకి కూడా చాలా మంది స్వేచ్ఛావంతమైన వ్యక్తుల సహకారం అవసరం అనే సంగతి తెలిసినపుడు, మార్కెట్ యొక్క అద్భుతాన్ని స్వీకరించే అవకాశం ఉంది. ఇది లియోనర్డ్ రీడ్ ఈ వ్యాసం ద్వారా అందరికీ చెప్పాలనుకున్న ముఖ్యమైన విషయం.

“నేను, పెన్సిల్” అనేక దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ముద్రిత రూపంలో, ఆడియో రూపంలో, అనేక భాషల్లో అందుబాటులోకి వచ్చింది. కానీ ఇప్పుడు తొలిసారి తెలుగు భాషలో వస్తోంది. ఇది ఆసియా ఉపఖండంలో చాలా మందికి ఈ మంచి సందేశాన్ని చేరవేస్తుంది. లియోనర్డ్ రీడ్ గారు ఇది చూసి చాలా సంతోషపడేవారు. ఇది చదివే ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు చెప్పేవారు.

ప్రియమైన పాఠకులారా, ఈ రచన చదివినందుకు ధన్యవాదాలు.

దీనిలోని భావాలను మీరు ఆలోచించి, ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నాను.

**లారెన్స్ డబ్ల్యు రీడ్,**
ప్రెసిడెంట్ ఎమెరిటస్, ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్ ఎడ్యుకేషన్
అట్లాంటా, జార్జియా, అమెరికా
ఏప్రిల్ 2024

# నేను, పెన్సిల్‌ని
## తెలుగు సంచికకు ముందుమాట

"నేను, పెన్సిల్‌ని" వ్యాసం కేవలం ఒక వస్తువు యొక్క ఉత్పత్తి కథ మాత్రమే కాదు, స్వేచ్ఛా మార్కెట్ యొక్క అద్భుతానికి, వ్యక్తుల సహకారానికి నిదర్శనం. ఒక సాధారణ పెన్సిల్ తయారీలో ఒక్కొక్క భాగాన్ని తయారు చేయటానికి ఎన్నో వేలమంది వ్యక్తులు, ఒకరినొకరు కనిపించకుండానే, చెప్పకుండానే సహకరించడం చూస్తే, స్వేచ్ఛగా పనిచేసే సమాజం ఎంత అద్భుతంగా పనిచేస్తుందో మనం గ్రహించగలుగుతాము. స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థ ఎంత శక్తివంతమైనదో, ప్రభుత్వ నియంత్రణలు ఎంత అనవసరమో ఈ చిన్న కథ ద్వారా 1958లో లియోనార్డ్ రీడ్ రచించిన "నేను, పెన్సిల్‌ని" వ్యాసంలో ఎంతో స్పష్టంగా వివరించారు. మార్కెట్ స్వేచ్ఛతో సహజంగా ఏర్పడే సహకారం ఊహించని స్థాయిలో అభివృద్ధిని తీసుకురాగలదని నిరూపిస్తుంది..

భారతదేశంలో ప్రభుత్వం అనుసరించిన 'లైసెన్స్ రాజ్' అనే కఠినమైన నియంత్రణాత్మక విధానం దేశంలో ఆర్థిక స్వేచ్ఛను తీవ్రంగా కుంగదీసింది. 1991 ఆర్థిక సరళీకరణ తరువాత, ఈ పరిస్థితులు పూర్తిగా మారాయి. మార్కెట్‌కు స్వేచ్ఛనిచ్చి, విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరచి, ప్రభుత్వ నియంత్రణలను తగ్గించిన తరువాత భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందడం మొదలైంది. లియోనార్డ్ రీడ్ కోరిన ఆర్థిక స్వేచ్ఛ ఇదే. ఈ మార్పుల ఫలితాలు మనం ఈరోజు స్పష్టంగా చూస్తున్నాం.

ఈ వ్యాసం చదివిన తర్వాత, ఆర్థిక వ్యవస్థలో స్వేచ్ఛ యొక్క అవసరం ఏమిటో పాఠకులు గ్రహిస్తారని ఆశిస్తున్నాను. మనం కోల్పోతున్న స్వేచ్ఛను గుర్తించడానికి, గౌరవించడానికి దాన్ని పరిరక్షించడానికి ప్రేరణ పొందవచ్చు. ఇది ఖచ్చితంగా మన విద్యార్థులు, పాలకులు, యువత ప్రతి ఒక్కరూ చదవాల్సిన ఆలోచనాత్మక రచన. ఈ అనువాదం ద్వారా ఆ అద్భుత ఆలోచనలను తెలుగులో కూడా అందించాలన్నది నా చిన్న ప్రయత్నం.

**రాఘవేందర్ అస్కాని**
స్వతంత్రత సెంటర్,
సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్
మే 2025

# నేను, పెన్సిల్

## నా వంశవృక్షం లియొనార్డ్ ఇ. రీడ్ రచన

నేను సీసపు పెన్సిల్‌ని. చదవగలిగే, రాయగలిగే అబ్బాయిలు, అమ్మాయిలు, పెద్దలు అందరికీ తెలిసిన సాధారణ చెక్క పెన్సిల్.

రాయటం నా వృత్తి, వ్యాపకం; అది మాత్రమే నేను చేసేది.

నా వంశవృక్షం ఎందుకు రాయాల్సి వస్తోంది అని మీరు ఆశ్చర్యపోవచ్చు. ప్రారంభించడానికి, నా కథ ఆసక్తికరంగా ఉంటుంది. ఆ తర్వాత, నేనో రహస్యాన్ని. ఒక చెట్టు, ఒక సూర్యాస్తమయం లేదా ఒక మెరుపు లాగే నేనో మిస్టరీని. కానీ, నన్ను ఉపయోగించేవాళ్లు నన్నో యధాలాప సంఘటనలాగా, నాకో నేపథ్యం ఉందని గుర్తించకుండా తమ జన్మహక్కన్నట్లు ఉపయోగిస్తుండటం నాకు విచారం కలిగిస్తుంది. నా పట్ల ఆ నిర్లక్ష్య ధోరణి నన్ను సాధారణ స్థాయికి నెట్టింది. ఘోర పొరపాటు చేస్తున్న జాతిగా ప్రమాదం బారిన పడకుండా మానవాళి ఎక్కువకాలం మనుగడ సాగించలేదు. విజ్ఞత గల జి.కె చెస్టర్‌టన్ చెప్పినట్లు, "మనం ఒక అద్భుతం కోసం తపించి అంతరించిపోతున్నాం, అద్భుతాల కోసం కాదు".

నేను, పెన్సిల్‌ని, పైకి సాధారణంగా కనిపించినా, మిమ్మల్ని సంభ్రమా శ్చర్యాలకు గురిచేయగలను. నేను చెప్పేది అతిశయోక్తి కాదని, నిజమని నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తాను. మీరు నన్ను అర్థం చేసుకుంటే అనటానికి కొద్దిగా సంశయిస్తున్నా, ఎందుకంటే, అది ఎవరి నుంచైనా అది మితిమీరి ఆశించటమవుతుంది.

కానీ మీరు నన్ను అర్థం చేసుకుంటే, నా సంకేతంగా ఉన్న అద్భుతత్వాన్ని గుర్తించగలిగితే, మానవాళి ఎంతో నిరుత్సాహకరమైన రీతిలో కోల్పోతున్న స్వేచ్ఛను పరిరక్షించటంలో మీరు సాయపడగలరు. బోధించటానికి నా వద్ద ఒక లోతైన పాఠం ఉంది. ఒక ఆటోమొబైల్ లేదా ఒక విమానం, ఒక యాంత్రిక డిష్‌వాషర్ కంటే మిన్నగా నేను ఈ పాఠం చెప్పగలను. ఎందుకంటే, నేను సాధారణంగా కనిపిస్తాను కాబట్టి.

సాధారణం?.. అయినా, ఈ భూమ్మీద ఉండే సాధారణ వ్యక్తికి కూడా నన్ను ఎలా తయారుచేయాలో పూర్తిగా తెలియదు. ఇది అద్భుతంగా అనిపించటం లేదూ? ముఖ్యంగా అమెరికాలో ప్రతి సంవత్సరం ఒకటిన్నర బిలియన్ దాకా నాలాంటి పెన్సిళ్లను ఉత్పత్తి చేస్తారని తెలిసినప్పుడు.

**“కానీ మీరు నన్ను అర్థం చేసుకుంటే, నేను సంకేతంగా ఉన్న అద్భుతత్వాన్ని గుర్తించగలిగితే, మానవాళి ఎంతో నిరుత్సాహకరమైన రీతిలో కోల్పోతున్న స్వేచ్ఛను పరిరక్షించటంలో మీరు సాయపడగలరు.**

నన్ను పైకి మీ చేతిలోకి తీసుకోండి, పరిశీలనగా చూడండి. ఏం కనిపిస్తోంది? మరీ ఎక్కువేమీ కంటికి ఆనదు. కొంత చెక్క, లక్క, ముద్రించిన అక్షరాలు, గ్రాఫైట్ సీసం, కొద్దిపాటి లోహం, ఒక రబ్బరు. అంతే.

## లెక్కలేనన్ని పూర్వజన్మలు

మీ పూర్వీకుల గురించి ఒక పరిధి దాటి మరీ పూర్వంలోకి వెళ్లి మీరు ఎలా గుర్తించలేరో, నా పూర్వ వృత్తాంతాలన్నిటినీ పేరుపేరునా వివరించటం నాకూ అసాధ్యం. కానీ నా నేపథ్యంలోని సుసంపన్నత, సంక్లిష్టత మీకు అర్థమయ్యేందుకు అవసరమైన వివరాల్ని వాటి నుంచి మీకు సూచన ప్రాయంగా చెప్పాలనుకుంటున్నాను.

నా వంశ వృక్షం ఒక చెట్టుతో ప్రారంభమవుతుంది. ఉత్తర కాలిఫోర్నియా, ఒరెగాన్‌లో పెరిగే నిటారు దేవదారు చెట్టు అది. ఇప్పుడు ఒక్కసారి ఊహించుకోండి. దేవదారు వృక్షాల దిగుబడి, దేవదారు దుంగల్ని ట్రక్కుల మీదకి ఎక్కించి రైలు ఉపమార్గం వద్దకు పంపేందుకు ఉపయోగించే ఆ రంపాలు, ట్రక్కులు, తాడు, ఇతర యంత్ర సామాగ్రి గురించి ఆలోచించండి. మొత్తం అక్కడ పనిచేసేవారి గురించి, వాటి తయారీలో భాగమైన అసంఖ్యాక నైపుణ్యాల గురించి ఆలోచించండి: ముడి లోహాన్ని వెలికితీయటం, ఉక్కును, దాన్నుంచి శుద్ధితో రంపాలు, గొడ్డళ్లు, మోటార్లు తయారుచేయటంబీ జనపనార ఉత్పత్తి చేసి దాన్ని అన్ని దశల గుండా భారీ, దృఢమైన తాడు తయారీ దాకా తీసుకురావటంబీ పడకలు, భోజన హాళ్ల సదుపాయంతో కలప దుంగలు కొట్టేవారి క్యాంపులు, వంటపాత్రలు, అన్ని రకాల ఆహారపదార్థాల తయారీ. అంతదాకా ఎందుకు, కలప పనిచేసే కార్మికులు సేవించే ప్రతి కప్పు కాఫీ వెనక ఎవరికీ తెలియని వేలాది మంది హస్తం ఉంది!

కాలి ఫోర్నియాలోని శాన్ లియాండ్రోలో ఉన్న ఓ మిల్లుకి దుంగల్ని రవాణా చేస్తారు. రైలు రవాణా కార్లు, పట్టాలు, రైలుమార్గ ఇంజిన్‌లను తయారుచేసే, వాటితో అనుసంధానిస్తూ సమాచార వ్యవస్థల్ని నిర్మించి వినియోగానికి సిద్ధంగా బిగించే వ్యక్తులెవరో మీరు ఊహించగలరా? ఈ శ్రామిక దళాలు మొత్తం నా పూర్వీకుల్లో భాగం.

శాన్ లియాండ్రోలో మిల్లులో జరిగే పని చూడండి. దేవదారు దుంగల్ని చిన్న, పెన్సిల్ పొడవున్న బద్దల్లాగా ముక్కలు చేస్తారు. ఇవి అంగుళంలో నాలుగో వంతు మందంలో ఉంటాయి. వీటిని కొలిమిలో ఎండబెట్టి తేమ లేకుండా చేస్తారు. మహిళలు తమ ముఖాల మీద లేత ఎరుపు రంగు మేకప్ ఎందుకోసం అద్దుకుంటారో అందుకోసమే వీటిపై లేత రంగు అద్దుతారు. నేను తెల్లగా పాలిపోయినట్లు కాకుండా ఆకర్షణీయంగా ఉంటేనే గదా ప్రజలకు నచ్చేది! ఆ తర్వాత చెక్క బద్దలకు మైనం పూసి, కొలిమిలో తిరిగి ఎండబెడతారు. ఈ అద్దకానికి, కొలిమి తయారుచేయటానికి, తగిన వేడి, వెలుతురు, విద్యుత్, బెల్టులు, మోటార్లు, మిల్లుకి అవసరమైన మిగతా అన్ని వనరుల్నీ సరఫరా చేయటానికి ఎన్ని నైపుణ్యాలు అవసరమై ఉంటాయి? మిల్లులోని స్వీపర్లు నా పూర్వీకుల్లో భాగమా? అవును, మిల్లుకు విద్యుత్ సరఫరా చేసే పసిఫిక్ గ్యాస్ & ఎలక్ట్రిక్ కంపెనీ హైడ్రోప్లాంట్ డ్యామ్‌కి కాంక్రీట్ పోసిన వారు కూడా నా పూర్వీకుల్లో భాగం.

దేశవ్యాప్తంగా అరవై కారు లోడ్ల చెక్కబద్దల్ని రవాణా చేయటంలో భాగస్వాములైన ప్రస్తుత, నా సుదూర పూర్వీకుల్ని విస్మరించవద్దు.

నా తల్లిదండ్రులు ఎంతో పొదుపరులు, డబ్బు ఆదా చేసేవారు. ఆ రకంగా వాళ్లు పెన్సిల్ ఫ్యాక్టరీకి మొత్తం పెట్టుబడి సేకరించి 4,000,000 డాలర్లతో యంత్రాలు, భవనం ఏర్పాటు చేశాక పని ప్రారంభమవుతుంది. మొదట ప్రతి చెక్కబద్దలో ఒక సంక్లిష్ట యంత్రం ద్వారా ఎనిమిది గాడులను ఏర్పరుస్తారు. ఆ తర్వాత మరో యంత్రం ప్రతి గాడిలో సీసం వేస్తుంది. జిగురు అద్దుతుంది. ఆ పైన మరో చెక్కబద్ద వేస్తుంది. సీసం శాండ్‌విచ్‌లా అన్నమాట. "చెక్క పట్టి ఉంచిన ఈ శాండ్‌విచ్" నుంచే ఏడుగురు సోదరులు, నేను యంత్రాల ద్వారా తయారవుతాం.

నా "సీసం' కూడా చాలా సంక్లిష్టమైనది. అందులో ఇక ఎంత మాత్రం సీసం ఉండదనుకోండి - గ్రాఫైట్‌ను సిలోన్ (శ్రీలంక)లో తయారుచేస్తారు. ఆ గనుల తవ్వకందారుల్ని, రకరకాల పరికరాల్ని తయారుచేసేవారిని, గ్రాఫైట్ రవాణా కోసం ఉపయోగించే కాగితం సంచుల తయారీదారుల్ని చూడండి. అదే రీతిలో సంచులను కలిపి ఉంచే దారం తయారీదారుల్ని, వాటిని ఓడల మీదకి ఎక్కించేవారిని, ఓడల్ని

తయారుచేసేవారిని చూడండి. మార్గంలో నా పుట్టుకలో లైట్‌హౌస్‌ల నిర్వాహకులైన హార్బర్ పైలట్లు కూడా సహాయపడ్డారు.

గ్రాఫైట్‌ను మిస్సిస్సిపి నుంచి తెచ్చిన బంకమన్నుతో కలుపుతారు. ఇందులో చేసే శుద్ధి ప్రక్రియలో అమ్మోనియం హైడ్రాక్సైడ్‌ను ఉపయోగిస్తారు. ఆ తర్వాత జంతు కొవ్వులను సల్ఫ్యూరిక్ ఆమ్లంతో రసాయన చర్య జరపటం ద్వారా వచ్చే సల్ఫొనేటెడ్ కొవ్వు వంటి తడి కారకాలను కలుపుతారు. అనేక యంత్రాలను దాటుకుంటూ వెళ్లాక ఆ మిశ్రమం చివరికి ఒక సాసేజ్ గ్రైండర్ నుంచి వెలువడుతుండే ముక్కల్లా తయారవుతుంది. వాటిని తగిన సైజులోకి కత్తిరించి 1,850 డిగ్రీల ఫారిన్‌హీట్ వద్ద తేమను తొలగించి ఎన్నో గంటలపాటు రొట్టెల తయారీ తరహాలో కాలుస్తారు. తర్వాత వాటి పటుత్వాన్ని, మృదుత్వాన్ని పెంచేందుకు సీసాన్ని వేడి మిశ్రమంతో కలుపుతారు. మెక్సికో నుంచి తెప్పించిన సిండరెల్లా మైనం, పారాఫిన్ మైనం, హైడ్రోజనేటెడ్ సహజ కొవ్వులతో కూడిన మిశ్రమమది.

నా దేవదారుపై ఆరు దఫాలు లక్కను అద్దుతారు. లక్కలో ఉండే దినుసులన్నీ మీకు తెలుసా? ఆముదం విత్తనాల పెంపకందారులు, ఆముదం నూనె శుద్ధిదారులు కూడా ఇందులో భాగస్వాములని ఎవరనుకుంటారు? కానీ వాళ్లు భాగస్వాములు.

**ఎందుకు, లక్కను అందమైన పసుపుగా తయారుచేసే ప్రక్రియల్లో కూడా మనం లెక్కలేనంతమంది నైపుణ్యాలు ఎందుకు దాగివుంటాయి.**

**”**

పేరు ముద్రించిన అచ్చును పరిశీలించండి. జిగురుతో కలిపిన కార్బన్ బ్లాక్‌ను వేడి చేయటం ద్వారా ఏర్పడిన ఫిల్మ్ అది. మీరు ఆ జిగురు పదార్థాలను ఎలా తయారుచేస్తారు? కార్బన్ బ్లాక్ అంటే ఏమిటి? (దయచేసి చెప్పగలరా) లక్కను అందమైన పసుపుగా తయారుచేసే ప్రక్రియల్లో కూడా మనం లెక్కలేనంతమంది నైపుణ్యాలు ఎందుకు దాగివుంటాయి?

నాకున్న లోహపు ముక్క, ఆ మూత ఇత్తడిది. జింకు, రాగి లోహాలను తవ్వి తీసే వారు, ఆ ప్రకృతి ఉత్పత్తుల నుంచి మెరిసే ఇత్తడి రేకును తయారుచేసే నైపుణ్యాలున్న వారు.. వారందరి గురించీ ఆలోచించండి. నా మూత మీద ఉన్న నల్లవలయాలు నల్ల నికెల్. నల్ల నికెల్ అంటే ఏమిటి? దాన్ని ఎలా వేస్తారు? నా మూత మధ్యభాగంపై నల్ల నికెల్ ఎందుకు లేదో మొత్తం కథ చెప్పాలంటే చాలా పేజీలు పడతాయి.

ఆ తర్వాత నాకు టిప్ తయారు చేస్తారా. అయితే అంతటి టిప్ ని కూడా వ్యాపారంలో అందవికారంగా “ప్లగ్ భాగం” అంటారు. నాతో చేసే తప్పుల్ని చెరిపేసుకునేందుకు

మనిషి ఆ భాగాన్ని ఉపయోగించుకుంటాడు. "ఫాక్టిజ్" అనే పదార్థం ఆ చెరిపివేతల్ని గావిస్తుంది. ఇది రబ్బర్ లాంటి ఉత్పత్తి. డచ్ ఈస్ట్ ఇండీస్ (ఇండొనేషియా) నుంచి ర్యాప్‌సీడ్ ఆయిల్‌ను సల్ఫర్ క్లోరైడ్‌తో కలపటం ద్వారా దీన్ని తయారుచేస్తారు. సాధారణ భావనకు భిన్నంగా, రబ్బర్‌ను కేవలం కలిపి ఉంచే అవసరాల కోసమే వినియోగిస్తారు. అప్పుడు కూడా వల్కనైజేషన్, వేగవంతం చేయటానికి కలిపే కారకాలు అనేకం ఉంటాయి. సానపట్టే రాయి ఇటలీ నుంచి వస్తుంది "ప్లగ్"కి ఉండే రంగు కాడ్మియం సల్ఫైడ్ వర్ణద్రవ్యం నుంచి వస్తుంది.

## ఎవరికీ తెలియదు

ఇప్పుడు చెప్పండి. నన్ను ఎలా తయారుచేయాలో ఈ భూమ్మీద ఏ ఒక్క వ్యక్తికీ తెలియదని నేను మొదట్లో చేసిన ప్రకటనను ఎవరైనా సవాలు చేయాలనుకుంటున్నారా?

**"నిజానికి, నన్ను సృష్టించటంలో పదుల లక్షల మంది మనుషుల పాత్ర ఉంది. వారిలో చాలామందికి మిగిలినవారిలో ఎవరూ అంత ఎక్కువగా తెలియదు.**

నిజానికి, నన్ను సృష్టిం చటంలో పదుల లక్షల మంది మనుషుల పాత్ర ఉంది. వారిలో చాలామందికి మిగిలిన వారిలో ఎవరూ అంత ఎక్కువగా తెలియదు. మీరు అనొచ్చు, నన్ను తయారు చేయటానికి ఎక్కడో సుదూరంగా ఉన్న బ్రెజిల్‌లోని కాఫీ పంట సేకరణ దారుల్ని మరెక్కడో ఉన్న ఆహార ఉత్పత్తి దారులతో కలపటం ద్వారా నేను ఎక్కడికో వెళ్లాను, ఇది మరీ అతి అని మీరు అనుకోవచ్చు. నా ప్రకటనకు కట్టుబడి ఉంటాను. ఈ మిలియన్ల మందిలో, పెన్సిల్ కంపెనీ అధ్యక్షుడితో సహా, కొద్దిపాటి, సూక్ష్మస్థాయిలో తప్ప నా తయారీ గురించి పరిజ్ఞానం, నైపుణ్యం ఉన్నవారు ఒక్కరంటే ఒక్కరు లేరు. తయారీ పరిజ్ఞానం విషయానికి వస్తే సిలోన్‌లోని గ్రాఫైట్ గని తవ్వకందారునికి, ఒరెగాన్‌లోని కలప కార్మికునికి మధ్య ఉన్న తేడా, పరిజ్ఞానంలో మాత్రమే. గని తవ్వకందారుకి గాని, కలప కార్మికునికిగాని, ఫ్యాక్టరీలోని కెమిస్ట్ లేదా చమురు క్షేత్రంలోని కార్మికుడి కంటే ఎక్కువ బాధ్యతను బదిలీ చేయటం సాధ్యం కాదు. చమురు క్షేత్రం ఎందుకు అవసరమైందంటే, పారాఫిన్ అనేది పెట్రోలియం ఉప ఉత్పత్తి కాబట్టి.

ఇక్కడొక ఆశ్చర్యకరమైన వాస్తవం ఉంది. చమురు క్షేత్రంలోని కార్మికుడు కావచ్చు, కెమిస్ట్, గ్రాఫైట్ లేదా బంకమన్ను తవ్వకందారు, ఓడలు, రైళ్లు లేదా ట్రక్కుల్ని తయారుచేసే లేదా నిర్వహించేవారు, నా లోహంపై వలయాలు చేసే యంత్రాన్ని నడిపేవారు, చివరికి కంపెనీ అధ్యక్షుడు కూడా కావచ్చు.. తన పరిధిలో చేస్తున్న పనిని అతను నన్ను కోరుకోవటం వల్ల చేయటం లేదు. బహుశా ఒకటో తరగతిలోని ఒక విద్యార్థి/విద్యార్థిని కన్నా తక్కువగా వారంతా నన్ను కోరుకున్నారు. నా తయారీలో భాగమైన ఈ లక్షలాది మందిలో అసలు పెన్సిల్‌ను చూడనివారు, ఒక పెన్సిల్‌ను ఎలా ఉపయోగించాలో తెలియనివారు కూడా కొంతమంది ఉన్నారు. వారికి ప్రేరణ నేను కాదు, వేరే. విషయాన్ని బహుశా ఈ రకంగా చెప్పవచ్చేమో: తనకవసరమైన, తాను కోరుకున్న వస్తువులు, సేవలను పొందటం కోసం తనకు తెలిసిన కొద్ది పరిజ్ఞానాన్ని ఇతరులతో ఆ విధంగా మార్పిడి చేసుకోవాలి అని వీరిలో ప్రతి ఒక్కరూ కోరుకుంటుండవచ్చు. నేను ఈ వస్తువుల్లో ఒకటి కావచ్చూ, కాకపోవచ్చు.

## సూత్రధారంటూ లేరు

ఇంకా ఆశ్చర్యం కలిగించే ఒక నిజం ఉంది: ఒక ముఖ్యమైన ఆలోచనా పరుడు లేకపోవడం, లేదా నన్ను తయారుచేయడానికి లెక్కలేనన్ని పనులను ఆజ్ఞాపించే లేదా బలవంతంగా నిర్దేశించే ఎవరూ లేకపోవడం. అలాంటి వ్యక్తి జాడ ఎక్కడా కనిపించదు. బదులుగా, అదృశ్య హస్తం పనిచేయడం మనం చూస్తాము. ఇంతకుముందు నేను చెప్పిన రహస్యం ఇదే.

"భగవంతుడు మాత్రమే చెట్టును తయారుచేయగలడు'' అని చెబుతారు. మనం దీనితో ఎందుకు ఏకీభవిస్తాం? మనంతట మనం అలా ఒక చెట్టును తయారుచేయలేం కాబట్టి కాదూ? నిజానికి, మనం ఒక చెట్టును వర్ణించనైనాగలమా? పైపై పదాలతో మినహాయించి చేయలేం. ఉదాహరణకు, ఒక విధమైన కణాల అమరిక తనకు తానుగా చెట్టుగా రూపాంతరం చెందుతుందని మనం చెప్పగలం. కానీ ఒక చెట్టు జీవితకాలంలో కణాలలో చోటుచేసేకునే నిరంతరం మార్పులను నిర్దేశించటం మాట అలా ఉంచి, కనీసం నమోదు చేసే మేధస్సు మనిషికి ఉందా? అటువంటి విన్యాసం ఊహలకు కూడా ఏమాత్రం అందదు.

నేను, పెన్సిల్‌ని. అటువంటి సంక్లిష్ట అద్భుతాల సమ్మేళనాన్ని. ఒక చెట్టు, జింకు, రాగి, గ్రాఫైట్, ఇంకా చాలా ఉన్నాయి. ప్రకృతిలో వాటంతటవే చోటు చేసుకునే ఈ అద్భుతాల కంటే కూడా అసాధారణ అద్భుతాన్ని జోడిరచటమైనది. అది సృజనాత్మక

మానవ సామర్థ్యాల సమ్మేళనం. మనిషి అవసరాలు, కోరికలకు ప్రతిస్పందనగా లక్షలాది చిన్నపాటి పరిజ్ఞానాలు సహజంగా, అసంకల్పితంగా ఒక చోట అమరటం, ఎటువంటి మానవ సూత్రధారి లేకున్నా అది సాధ్యమవటం అసాధారణ అద్భుతం. చెట్టును దేవుడు మాత్రమే తయారుచేయగలడు కాబట్టి, నన్ను కూడా దేవుడు మాత్రమే తయారు చేయగలడని వాదిస్తాను. కణాలను కలిపి చెట్టును తయారుచేయలేని మనిషి లక్షలాది మంది మనుషులు తమ చిన్నపాటి పరిజ్ఞానాలతో నన్ను తయారుచేయటాన్ని ఎంతమాత్రం నిర్దేశించలేడు.

"నేను ఏ అద్భుతత్వానికైతే సంకేతంగా ఉన్నానో ఆ అద్భుతత్వం గనక మీకు అర్థమైతే, మానవాళి ఎంతో బాధాకరరీతిలో కోల్పోతున్న స్వేచ్ఛను కాపాడటంలో మీరు సహాయపడగలరు" అని రాయటం వెనక నా ఆంతర్యం అదే. మనిషి అవసరం, డిమాండ్లకనుగుణంగా ఈ చిన్న పరిజ్ఞానాలు సహజంగా, అవును, వాటంతటవే తమను తాము సృజనాత్మక, ఉత్పాదక క్రమాలుగా అమర్చుకుంటాయని అంటే, ప్రభుత్వ లేదా ఏ ఇతర బలప్రయోగంతో కూడిన సూత్రధారి లేకుండా అమర్చుకుంటాయని అర్థమైతే అప్పుడు స్వేచ్ఛకు తప్పనిసరి అవసరమైన 'స్వేచ్ఛాయుత ప్రజల పట్ల విశ్వాసం' అనే మౌలిక ధాతువును ఆ వ్యక్తులు కలిగివుంటారు. ఈ విశ్వాసం లేకుండా స్వేచ్ఛ అసాధ్యం.

తపాలా పంపిణీని ఉదాహరణగా చూడండి. ఒక్కసారి ప్రభుత్వం అటువంటి సృజనాత్మక కార్యకలాపంపై గుత్తాధిపత్యం కలిగివుంటే, స్వేచ్ఛగా వ్యవహరించే వాళ్లతో ఉత్తరాలను సమర్థవంతంగా పంపిణీ చేయటం సాధ్యం కాదని చాలామంది నమ్మటం మొదలవుతుంది. అందుకు కారణం: మెయిల్ పంపిణీనికి ముందు అవసరమైన పనుల్ని ఎలా చేయాలో తెలియదని ప్రతి ఒక్కరూ చెబుతారు, ఒప్పుకుంటారు. ఇతర వ్యక్తులెవరూ చేయలేరని కూడా అతను గుర్తిస్తాడు. ఈ అంచనాలు వాస్తవం. ఒక పెన్సిల్ తయారీలో అవసరమైన మొత్తం పరిజ్ఞానం ఏ ఒక్క వ్యక్తికీ లేనట్లే, దేశంలో తపాలా పంపిణీనికు తగిన పరిజ్ఞానం ఒక వ్యక్తికి ఉండదు. స్వేచ్ఛాయుత ప్రజల పట్ల విశ్వాసం లేనప్పుడు లక్షలాది చిన్న చిన్న పరిజ్ఞానాలు ఈ అవసరానికి తగినట్లుగా సహజంగా, అద్భుతంగా రూపొంది సహకరించుకుంటాయన్న అవగాహన కొరవడి, ప్రభుత్వం సూత్రధారి పాత్ర పోషించటం ద్వారా మాత్రమే తపాలా పంపిణీ అవుతాయనే పొరపాటు అభిప్రాయాలకు వ్యక్తులు రాకుండా ఉండలేరు.

## లెక్కకు మిక్కిలి సాక్ష్యాధారాలు

స్వేచ్ఛగా ప్రయత్నించే అవకాశం వచ్చినప్పుడు మహిళలు, పురుషులు ఏమి సాధించగలరో రుజువు చేసే వస్తువు నేను, పెన్సిల్‌ని మాత్రమే అయినప్పుడు, స్వేచ్ఛాయుత

ప్రజల్ని పెద్దగా విశ్వసించనివారు చెప్పేదాంట్లో అర్థం ఉందనుకోవచ్చు. కానీ, రుజువులు కోకొల్లలు; ఇదంతా మా గురించే, ప్రతి ఒక్కరి చేతుల్లో ఉన్నది. ఉదాహరణకు, ఒక ఆటోమొబైల్, ఒక గణన యంత్రం, గ్రెయిన్ కంబైన్ లేదా మిల్లింగ్ యంత్రం, ఇంకా లక్షలాది ఇతర విషయాలతో పోల్చి చూస్తే తపాలా పంపిణీ ఎంతో సులభం. ఇక సకాలంలో గమ్యం చేరవేయటానికి సంబంధించి చూస్తే, ఎందుకని వ్యక్తులకు ప్రయత్నించే స్వేచ్ఛ ఇచ్చిన చోటల్లా వాళ్ళు మానవ స్వరాన్ని ప్రపంచంలోని ఏ మూలకైనా ఒక్క క్షణం కంటే తక్కువ సమయంలో చేరవేస్తున్నారు. ఒక సంఘటన జరుగుతున్నప్పుడే చలనచిత్రంగా ఏ వ్యక్తి ఇంటికైనా అందించగలుగుతున్నారు. 150 మంది ప్రయాణికులను సియాటెల్ నుంచి బాల్టిమోర్‌కి నాలుగు గంటల కంటే తక్కువ సమయంలో తీసుకెళ్తున్నారు; గ్యాస్‌ను, కొలిమిని టెక్సాస్ నుంచి న్యూయార్క్‌లోని ఫర్నెస్‌కి నమ్మశక్యంగాని తక్కువ రేట్లతో, ఎటువంటి సబ్సిడీ లేకుండా సరఫరా చేయగలుగుతున్నారు; వారు ప్రతి నాలుగు పౌండ్ల చమురును పెర్షియన్ గల్ఫ్ నుండి మన తూర్పు సముద్ర తీరానికి-ప్రపంచంలో సగం దూరం-ఒక ఔన్స్ లెటర్‌ను వీధిలో పంపిణీ చేయడానికి ప్రభుత్వం వసూలు చేసే దానికంటే తక్కువ డబ్బుకు పంపిణీ చేస్తారు!

నేను చెప్పాల్సిన పాఠం ఇదే: సృజనాత్మక సామర్థ్యాలన్నిటికీ కళ్లేలు వదలండి, నిస్సంకోచంగా స్వేచ్ఛనివ్వండి. మొత్తం సమాజం ఈ పాఠానికను గుణంగా పనిచేసేలా సమీకరిం చటానికి మాత్రమే పరిమితంకండి. అవరోధాలను సమాజంలోని చట్ట వ్యవస్థ ఎంత మేర తొలగించగలదో అంత మేర తొలగించనివ్వండి. తమకు తెలిసిన సృజనాత్మక పరిజ్ఞానాల్ని ప్రజలు స్వేచ్ఛగా వినియోగించేందుకు అనుమతించండి. అదృశ్య హస్తానికి స్వేచ్ఛాయుత పురుషులు, స్త్రీలు స్పందిస్తారని నమ్మండి. ఈ విశ్వాసం నిజమని నిర్ధారితమవుతుంది. నేను, పెన్సిల్‌ని, చాలా సాదాసీదాగా కనిపిస్తుండొచ్చుగానీ, నన్ను సృష్టించటం వెనక ఉన్న అద్భుతాన్నే ఈ ఆచరణాత్మక విశ్వాసానికి సాక్ష్యంగా చూపుతున్నాను. సూర్యుడు, వర్షం, దేవదారు చెట్టు, ప్రేమపూర్వక భూగోళం ఎంత నిజమో ఈ విశ్వాసం అంత ఆచరణసాధ్య నిజం.

**నేను చెప్పాల్సిన పాఠం ఇదే : సృజనాత్మక సామర్థ్యాలన్నిటికీ కళ్లేలు వదలండి, నిస్సంకోచంగా స్వేచ్ఛనివ్వండి.”**

**లియొనార్డ్ ఇ. రీడ్**
ప్రెసిడెంట్, ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్ ఎడ్యుకేషన్
డిసెంబర్ 1958

# తరువాయి మాట

## మిల్టన్ ఫ్రీడ్‌మన్

లియొనార్డ్ ఇ. రీడ్ ఆహ్లాదకర కథ "నేను, పెన్సిల్‌ని" ఒక ప్రామాణిక రచనగా గుర్తింపు పొందింది. అందుకు పూర్తి అర్హత కూడా ఈ రచనకు ఉంది. బలప్రయోగం లేకుండా పరస్పర సహకారం అనే ఆడమ్ స్మిత్ అదృశ్య హస్త సిద్ధాంతం, "ఏం చేయాలో ఇతరులు చెప్పాల్సిన అవసరం లేకుండా వ్యక్తులు వారంతట వారే చేయాల్సిన పనులను నిర్వర్తించే" అవగాహనను పెంచే సందేశాన్ని పంచటంలో ఎక్కడికక్కడ అసంఖ్యాక ప్రజల్లో ఉండే చిన్న చిన్న పరిజ్ఞానాలు, ధరల వ్యవస్థల పాత్రపై ఫ్రెడరిక్ హాయక్ సూత్రీకరణ.. రెంటి అర్థాన్ని ఇంత క్లుప్తంగా, ఆమోదయోగ్యంగా, ప్రభావశీలంగా చెప్పిన రచన మరొకటి నేను చూడలేదు.

"మార్కెట్ శక్తి"ని తేటతెల్లం చేయటానికి లియొనార్డ్ కథను మేం మా టెలివిజన్ షో "ఫ్రీ టు చూజ్"లో, ఆ తర్వాత అదే టైటిల్‌తో వచ్చిన పుస్తకంలో ఉపయోగించుకున్నాం (టీవీ షో మొదటి విభాగం, పుస్తకం మొదటి అధ్యాయం రెంటి శీర్షిక కూడా "మార్కెట్ శక్తి"). మేం ఆ కథను క్రోడీకరించాక ఇలా చెప్పాం:

"పెన్సిల్ ఉత్పత్తిలో పాలుపంచుకున్న వేలాది మంది వ్యక్తుల్లో ఎవరూ కూడా తాను పెన్సిల్ కావాలని తమ పని చేయలేదు. వారిలో కొందరు అసలు పెన్సిల్‌ను చూడను కూడా లేదు. పెన్సిల్ ఎందుకోసమో కూడా వారికి తెలియదు. పెన్సిల్ పాలుపంచుకున్న ప్రతి ఒక్కరూ తమ పనిని, తమకు కావలసిన వస్తువులు, సేవలను పొందడానికి ఒక మార్గంగా చూశారు. పెన్సిల్‌ను సంపాదించటం కోసం మనం ఉత్పత్తి చేసినవి వారికి అవసరమైన వస్తువులు, సేవలు. మనం ప్రతిసారీ దుకాణానికి వెళ్లి పెన్సిల్‌ను కొన్నప్పుడు, పెన్సిల్‌ను ఉత్పత్తి చేయడానికి వేలాది మంది అందించిన అతి చిన్న మొత్తంలో సేవలకు బదులుగా మన సేవలలో కొద్ది భాగాన్ని మారుస్తున్నాము.

"పెన్సిల్‌ను అసలు ఎప్పుడైనా ఉత్పత్తి చేయటం జరిగిందా అనే ప్రశ్న లేవనెత్తితే ఇంకా ఎక్కువ ఆశ్చర్యం కలగకమానదు. కేంద్ర కార్యాలయంలో కూర్చుని ఎవరూ ఈ వేలాది మందికి ఆదేశాలివ్వలేదు. ఇవ్వని ఆదేశాలను ఏ సైనిక పోలీసులూ అమలు చేయలేదు. ఈ ప్రజలు ఎక్కడెక్కడో వేర్వేరు ప్రాంతాల్లో ఉంటారు, వేర్వేరు భాషలు

మాట్లాడతారు, వేర్వేరు మతాల్ని పాటిస్తారు, వీళ్లలో అనేకమంది ఒకరినొకరు ద్వేషించుకుంటారు కూడా అయినా ఈ విభేదాలేవీ వీరిని ఒక పెన్సిల్ ఉత్పత్తిలో సహకరించుకోవటానికి అవరోధం కాలేదు. ఇది ఎలా సాధ్యమైంది? రెండు వందల సంవత్సరాల క్రితం ఆడమ్ స్మిత్ మనకు సమాధానమిచ్చారు''.

"నేను, పెన్సిల్‌ని'' అనే కథ లియొనార్డ్ ఇ. రీడ్ రచనకు మంచి ఉదాహరణ. ఈ కథ కల్పితంగా, సూటిగా ఉన్నా ఇందులో స్వేచ్ఛ పట్ల ఉన్న ప్రేమ ప్రతీ మాటలో కనిపిస్తుంది. లియొనార్డ్ రీడ్ ప్రజలకు ఏమి చేయాలో లేదా ఎలా ప్రవర్తించాలో చెప్పడానికి ప్రయత్నించలేదు. వ్యక్తులు తమను, వారు జీవిస్తున్న వ్యవస్థను అర్థం చేసుకోవడాన్ని మెరుగుపరచుకోవడంకోసమే ఆయన ప్రయత్నం.

ఇది ఆయన జీవిత దృక్పథం. ప్రభుత్వ ఉద్యోగంలో పనిచేయడం అనే అర్థంలో కాకుండా, ప్రజలకు సేవ చేసే లక్ష్యంతో, ఎంతో కాలం పాటు ఆయన అదే దిశగా పనిచేశారు. ఎంత ఒత్తిడొచ్చినా, ఆయన తన విలువలను వదిలిపెట్టలేదు. అందుకే ఆయన భావాలు మానవ స్వేచ్ఛకు అవసరం అయిన స్వేచ్ఛాయుత పోటీ, వ్యక్తిగత ఆస్తి, పరిమిత ప్రభుత్వ వ్యవస్థ వంటి అంశాలను మొదట్లోనే ప్రాచుర్యం పొందేలా చేశాయి. తరువాత వాటిని మరింతగా వ్యాప్తి చేసారు.

మిల్టన్ ఫ్రీడ్‌మన్,<br>
నోబెల్ గ్రహీత, 1976



# లియొనార్డ్ ఇ.రీడ్

లియొనార్డ్ ఇ. రీడ్ (1898-1983) ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్ ఎడ్యుకేషన్‌ను 1946లో స్థాపించారు. ఆ తర్వాత 37 సంవత్సరాలపాటు ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఇఇ) అధ్యక్షుడిగా సేవలందించారు. స్వేచ్ఛను ప్రచారం చేయటానికి, పెంచటానికి అలుపెరగని కృషి చేశారు. అమెరికా చరిత్రలో కీలక సమయంలో వ్యక్తి స్వేచ్ఛ, వ్యక్తిగత ఆస్తులను సమర్థించే వారందరిని సమీకరించి బలమైన సంఘటిత శక్తిగా మలచిన సహజ నాయకుడాయన.

ఆలోచనలు ఎంత శక్తిమంతమైనవో తెలియచెప్పే ఒక నిదర్శనం ఆయన జీవితం. ప్రెసిడెంట్ రొనాల్డ్ రీగన్ రాసినట్లు: స్వేచ్ఛను పరిరక్షించే, పెంపొందించే లక్ష్యం కోసం అంకితభావంతో చేసిన ఆయన కృషి వల్ల మన దేశం, ప్రజలు సుసంపన్నమయ్యారు. భావితరాలు ఆయన్నుంచి స్ఫూర్తి పొందుతారు”.

లియొనార్డ్ ఇ. రీడ్ 29 పుస్తకాలు, వందలాది వ్యాసాలు రాశారు. ఆయన రాసిన సుప్రసిద్ధ వ్యాసం “నేను, పెన్సిల్‌ని” మొదట 1958లో ప్రచురితమైంది. ఉత్పత్తి వివరాలు, ప్రాంతాల పేర్లలో అక్కడక్కడా కొద్ది మార్పులు చేసినా మౌలిక సూత్రాలు మాత్రం అలానే ఉన్నాయి.

SWATANTRATA

CENTER FOR HUMAN FLOURISHING FOUNDATION

www.swatantrata.org